
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 3 మెదక్
జిల్లాల వార్తలు
బుధవారం 2 జూలై 2025





పటాన్‌చెరు మార్చురీ వద్ద జనం



వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు రామచంద్రారావు

నలిగిన బతుకులు

సిగాచి పరిశ్రమ భారీ విస్ఫోటనం కార్మిక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. బతికేందుకు వచ్చిన వారిని అమాంతం ఛిద్రం చేసింది. శిథిలాల కింద నుంచి ఒక్కొక్కటిగా బయటపడుతున్న మృతదేహాలు పూర్తిగా కాలిపోయి, గుర్తుపట్టలేనంతగా మాంసం ముద్దలుగా మారడం హృదయాలను పిండేసింది. పోలీసులు అడ్డుకుంటున్నా, తమ ఆప్తులను గుర్తించే ప్రయత్నంలో గేట్ల వద్దకు పరుగులెడుతూ వాటిని చూసి గుండెలవిసేలా విలపించారు. పరిశ్రమ వద్ద ఎక్కడ చూసినా తమ వారి ఫొటోలతో కార్మికుల కుటుంబసభ్యులు, బంధువులు రోడ్లపైనే రోదిస్తున్న దృశ్యాలే కనిపించాయి. అంబులెన్స్‌లలో బూడిద మూటలుగా వస్తున్న మృతదేహాలను చూసి, తమ వారు ఈ రూపంలో మారారని జీర్ణించుకోలేకపోయారు.



సిగాచి పరిశ్రమలో తొలగిస్తున్న శిథిలాలు



కదిలిస్తే కన్నీళ్లే.. 5

సీఎం రాక.. బాధితులకు ఊరట

రామచంద్రాపురం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికవాడలో పేలుడు ఘటన కనీవినీఎరుగని రీతిలో జరిగిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో బాధితులకు ఊరట లభించింది. మంగళవారం ఉదయం సమయంలో సీఎం రాక సందర్భంగా పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడ సిగాచి పరిశ్రమ యజమానులను అధికార యంత్రాంగం పిలిపించింది. 11 తరువాత సీఎం రానున్న సందర్భంలో 10.30 గంటలకు యజమాన్య ప్రతినిధులు సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. పరిహారం వ్యవహారంపై చర్చలు జరిపారు. రూ.కోటి పరిహారం చెల్లించేటట్టు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల కార్మికుల కుటుంబాలకు పెద్ద ఊరట లభించనుంది. తక్షణం తాత్కాలిక పరిహారం ఇవ్వాలంటూ వచ్చిన ఆదేశాల మేరకు కలెక్టర్ ప్రావీణ్య మృతుల కుటుంబాలకు రూ.లక్ష పరిహారం మధ్యాహ్నం సమయానికి పంపిణీ చేశారు. సీఎం వచ్చి వెళ్లిన తరువాత

మిగతా 5వ పేజీలో





మాంసం ముద్దలుగా మారిన మృతదేహాలపై కప్పిన తెల్లని వస్త్రం

'సిగాచి' శిథిలాల కింద మరణమృదంగం

ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు తోడుగా ఎస్డీఆర్ఎఫ్

శిథిలాల నుంచి ఒక్కొక్కటిగా బయటపడిన మృతదేహాలు

మాంసం ముద్దలుగా శవాలు.. మూట కట్టి మార్చురీకి తరలింపు

డీఎన్ఏ పరీక్షలకు సంబంధీకుల రక్తనమూనాల సేకరణ

సిగాచి, పటాన్‌చెరు మార్చురీ వద్ద మిన్నంటిన రోదనలు

సీఎంతో సహా మంత్రుల పరామర్శ



ఫొటోతో యువకుడు

పటాన్‌చెరు/రామచంద్రాపురం టౌన్/పటాన్‌చెరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సిగాచి పరిశ్రమలో భారీ విస్ఫోటనం కార్మికుల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. గల్లంతైన వారంతా చనిపోయారని దాదాపు నిర్ధారణకు వస్తున్నారు. శిథిలాల తొలగించే క్రమంలో పెద్దఎత్తున కార్మికుల మృతదేహాలు పూర్తిగా కాలిపోయి మాంసం ముద్దల్లా మారి హృదయవిదారక స్థితిలో ఒక్కొక్కటిగా లభ్యమయ్యాయి. మంత్రి దామోదర్‌రాజనర్సింహ, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పంకజ్‌పరితోష్ పరిశ్రమ వద్దే మకాం వేసి రాత్రంతా పరిస్థితిని సమీక్షించారు. శిథిలాలను తొలగించే క్రమంలో భారీ వర్షం పడటంతో అంతరాయం కలిగింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు తోడుగా సింగరేణి బృందాలు(ఎస్డీఆర్ఎఫ్) రంగంలోకి దిగడంతో శిథిలాల తొలగింపు ప్రక్రియ వేగం పుంజుకున్నది. తెల్లావారే సరికి సుమారు 20 మృతదేహాలను వెలికి

మిగతా 5వ పేజీలో





సిగాచి పరిశ్రమలో పేలుడు శిథిలాలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి గడ్డం వివేక్ పక్కన కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్

అంబులెన్స్‌ల్లో సొంత గ్రామాలకు

12 మంది మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి అంబులెన్స్‌ల్లో స్వస్థలాలకు పంపించారు. రాష్ట్రంతో పాటు ఏపీ, బీహార్, ఒరిషా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారి మృతదేహాలను సొంత గ్రామాలకు తరలించారు. మృతదేహాలు గుర్తుపట్టే సమయంలో తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన వారి నిఖిల్‌రెడ్డి, రమ్య మృతదేహాలను గుర్తు పట్టలేని పరిస్థితులు ఉండటంతో రమ్య అక్క జ్యోత్స్న రక్తపరీక్షలు నిర్వహించిన తరువాత మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సొంత గ్రామాలకు మృతదేహాలను పంపే సమయంలో ఎఫ్ఐఆర్ కాపీతో పాటు సర్టిఫికెట్‌ను పోలీసులు జారీ చేస్తున్నారు.

మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉన్నతస్థాయి అధికారుల తనిఖీ

అసెస్మెంట్ ఇన్‌చార్జి డా.విమలథామస్ ఆధ్వర్యంలో పరిశీలన



మెడికల్ కళాశాలలో డా.విమలాథామస్, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రమాణాలను మెరుగుపర్చేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా ఉన్నతస్థాయి అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా, ఇందులో భాగంగా మంగళవారం మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్, జనరల్ గవర్నమెంట్ హాస్పిటల్, మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అసెస్మెంట్ ఇన్‌చార్జి డా.విమలాథామస్ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొన్నారు. తనిఖీలో భాగంగా అధికారులు విద్యా, వైద్య, వసతి సంబంధిత అంశాలపై తనిఖీ నిర్వహించి అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించారు. బోధన సిబ్బంది, ఖాళీల వివరాలు, విద్యార్థులకు వసతి, హాస్టల్, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, లైబ్రరీ, మెస్, యాంటీ ర్యాగింగ్ వ్యవస్థలు, కాలేజ్, హాస్పిటల్ మధ్య సమన్వయం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం అసెస్మెంట్ ఇన్‌చార్జి విమలథామస్ మాట్లాడుతూ ఈ తనిఖీ నివేదికను ముఖ్య కార్యదర్శికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.సునీతాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ వి.రవిశంకర్, వైస్ ప్రిన్సిపాల్ జయ, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థుల నమోదుపై దృష్టి సారించాలి : మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ ద్వారా జిల్లాలో చేపట్టిన బడిబాట విజయవంతమైందని, డ్రాపౌట్ విద్యార్థుల నమోదుపై దృష్టి సారించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యా, వైద్యం, పౌరసరఫరాల, సంక్షేమశాఖల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మన ఊరు-మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతుల విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు. టెన్త్ పాసైన విద్యార్థులు ఇంటర్‌లో, ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీలో చేరాలన్నారు. అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజన పథకం సమగ్రంగా అమలు చేయాలన్నారు. అయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఏడాదికి రెండుసార్లు ఆర్‌బీఎస్‌కే ద్వారా సంక్షేమ పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సంక్షేమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ పరిశుభ్రంగా తయారు చేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా వేడి ఆహార పదార్థాలు వడ్డించాలన్నారు. వసతి గృహాలకు సరఫరా చేసే వస్తువులు నాణ్యత లోపిస్తే రిటర్న్ చేయాలన్నారు. సీఎంఆర్ డెలివరీ విషయంలో పౌరసరఫరా శాఖ ద్వారా ప్రగతిని సాధించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి నిధుల కొరత అడ్డుతగులుతోంది. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకానికి (బాస్) రెండేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో పాఠశాలల నిర్వహణ భారంగా మారిందని యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మెదక్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలకు సుమారు రూ.1.75 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో, విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.



బకాయిలు చెల్లించాలని ఇన్‌చార్జి ఈడీ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ (ఫైల్)

స్కూళ్లకు బాస్ భారం

నిధులు లేక నిర్వహణకు ఇబ్బందులు

రెండేళ్ల నుంచి విడుదలలో జాప్యం

మెదక్ జిల్లాలో రూ.1.75 కోట్ల బకాయిలు

కొత్త పాఠశాలల ప్రక్రియ కొనసాగింపు

మెదక్ అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యను అందించడం 'బాస్' ముఖ్య ఉద్దేశం. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కూడా కొత్త పాఠశాలల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. సౌకర్యాలు, భవన ప్రణాళిక, అగ్నిమాపక భద్రత, ఐదేళ్ల ఉత్తీర్ణత శాతం, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను పాఠశాలలు సమర్పించాల్సి ఉంటుంది. అయితే, బకాయిలు పేరుకుపోవడంతో ప్రస్తుత బాస్ పాఠశాలల నిర్వాహకులు నిర్వహణ కష్టంగా మారుతోందని, పాఠశాలలు నడపలేమని చెబుతున్నారు.

మెదక్ జిల్లాలో బాస్ స్కూళ్లు

జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పథకం(బాస్) కింద ఐదు ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయి. అవి మెదక్‌లోని సిద్ధార్థ్ స్కూల్, గీతా స్కూల్, మంజీర, రామాయంపేటలోని వివేకానంద, తూప్రాన్‌లోని గీతా పాఠశాలలు. లక్కీడిప్ ద్వారా ఎంపికైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఈ పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశాలు లభిస్తాయి. ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు ఇంటి నుంచి రాకపోకలు సాగించాల్సి ఉండగా, ఐదో తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు పదో తరగతి వరకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తారు. ఒకటో తరగతి, ఐదో తరగతిలో ప్రవేశాలకు 60 సీట్ల చొప్పున కేటాయిస్తారు. డే స్కాలర్ విద్యార్థికి రూ.28 వేలు, హాస్టల్ సౌకర్యం ఉన్న విద్యార్థికి రూ.42 వేల చొప్పున ప్రభుత్వం యాజమాన్యాలకు చెల్లిస్తుంది. అయితే, ఈ నిధులు సకాలంలో అందకపోవడంతో నిర్వహణ భారం అవుతోందని యాజమాన్యాలు వాపోతున్నాయి.

357 మంది విద్యార్థులు

ప్రతీ సంవత్సరం బకాయిలు అంతకంతకు పెరుగుతూ పోతున్నాయి. జిల్లాకు బడ్జెట్ విడుదల అవుతున్నా, పాఠశాల యాజమాన్యాల ఖాతాలో మాత్రం చేరడం లేదు. ఆన్‌లైన్‌లో టోకెన్లు రిలీజ్ అయినట్లు కనిపించినా, బ్యాంకు ఖాతాల్లో చూస్తే ట్రెజరీ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల నుంచి మొత్తం 357 మంది విద్యార్థులు ఈ పథకం కింద చదువుతున్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా రెండేళ్లుగా మొత్తం రూ.1.75 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి



రెండేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నాం. హాస్టల్ విద్యార్థుల కోసం ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఫీజు బకాయిలు విడుదల చేయలేని పక్షంలో, తక్షణమే బాస్ స్కూళ్ల బాధ్యతను ప్రభుత్వమే తీసుకొని నడపాలి. లేదంటే పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతున్నాం.

- శ్రీనివాస్ చౌదరి, ట్రెస్మా మెదక్ జిల్లా అధ్యక్షులు

త్వరలో మంజూరు

బాస్ స్కూళ్ల విద్యార్థుల ఫీజుల బిల్లులు చేసి ఎస్టీవోకు పంపించాం. జిల్లాలో రెండేళ్లుగా 357 మంది విద్యార్థులకు సంబంధించి రూ.1.75 కోట్లు పెండింగ్‌లో ఉంది. ఉన్నతస్థాయిలో వాటికి క్లియరెన్స్ వచ్చిన వెంటనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది

- విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ, మెదక్

లొంక తండాలో విషజ్వరాల పడగ

- మంచం పట్టిన 30 మంది గిరిజనులు
- తండాలో వైద్య శిబిరం ఏర్పాటు

సిర్గాపూర్/కల్హేర్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని లొంక తండాకు చెందిన గిరిజనులు జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధ పడుతున్నారు. మూడు రోజులుగా తండాలో 30 మంది వరకు జ్వరాలు సోకడంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది మంగళవారం తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆది, సోమవారాల్లో జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు సిర్గాపూర్ పీహెచ్‌సీతో పాటు ఇతర ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్లి వైద్యం చేయించుకున్నట్లు బాధితులు తెలిపారు. తండాలో నిర్వహించిన వైద్య శిబిరంలో 20 మందికి పరీక్షలు జరిపి మందులు అందజేశారు. తండాలో అందరికీ వ్యాధులు నయమయ్యేంత వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సిబ్బంది తెలిపారు. ఎవరూ అనవసర భయాందోళనలకు గురి కావద్దని గిరిజనులకు వైద్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ వైద్య సిబ్బంది రాంచందర్, సురేఖ, తారాసింగ్ పాల్గొనగా మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవ్‌రావ్‌పాటిల్ గిరిజనులను పరామర్శించారు. అన్ని గిరిజన తండాల్లో వర్షాకాలంలో అంటువ్యాధులు, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిరంతరం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



సిర్గాపూర్ మండలం లొంక తండాలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ఖాజాపూర్ హత్య కేసులో ఎనిమిది మంది అరెస్టు

కల్హేర్/సిర్గాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సంచలనం కలిగించిన ఖాజాపూర్‌లో జరిగిన దారుణ హత్య కేసులో ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది నిందితులను రిమాండ్‌కు పంపించారు. వారిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కంగ్టి సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సిర్గాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఖాజాపూర్ గ్రామానికి చెందిన కుర్మ రమేష్, కుర్మ సాయిగొండ కుటుంబాలు దాయాదులు. వీరికి భూమి విషయంలో తగాదాలు ఉండగా ఈ తగాతాలో రమేష్ మిత్రుడు గ్రామానికి చెందిన కార్పట్ల జైపాల్‌ను దారుణంగా హత్య చేసి రమేష్‌ను తీవ్రంగా గాయపర్చిన విషయం విదితమే. దాయాదుల ఘర్షణలో జోక్యం చేసుకుంటున్నాడని జైపాల్‌ను అంతమొందించేందుకు నిందితులు పథకం పన్ని సాయిగొండకు చెందిన భూమి వద్ద ఆదివారం మాటు వేసినట్లు సీఐ తెలిపారు. అంతలోనే కుర్మ రమేష్, ఆయన స్నేహితుడు జైపాల్ అక్కడి చేరుకోగా గొడ్డలితో జైపాల్‌ను హత్య చేసి రమేష్‌ను తీవ్రంగా గాయపరచారని, రమేష్‌ను కూడా చంపేందుకు యత్నిస్తున్న తరుణంలో ఆయన తల్లి మణెమ్మ మరో వ్యక్తి అక్కడికి చేరుకోవడంతో నిందితులు పారిపోయినట్లు సీఐ తెలిపారు. ఈ హత్యలో ప్రత్యక్ష సంబంధం ఉన్న కుర్మ సాయిగొండ, ఆయన ముగ్గురు కుమారులు హన్మగొండ, రాజు, పండరి, భార్య కిష్టవ్వ, కోడళ్లు కవిత, వసుధ, మరో వ్యక్తి డాకుగొండలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న కంగ్టి సీఐ చంద్ర శేఖర్‌రెడ్డి, అదుపులో నిందితులు

మరణంలోనూ వీడని బంధం

తూప్రాన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వివాహబంధంతో ఒక్కటైన దంపతులు మరణంలోనూ ఒక్కటిగానే వెళ్లిపోయారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులు ఒకరి తర్వాత ఒకరు మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నాగులపల్లి (స్టేషన్ మాసాయిపేట) శివారులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన దాసరి రమేష్ (38)కు తూప్రాన్ మండలం అల్లాపూర్‌కు చెందిన స్వప్న (29)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం అయింది. సోమవారం దాసరి రమేష్, స్వప్న దంపతులు ద్విచక్ర వాహనంపై తూప్రాన్ మండలం నాగులపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా, పోలీసుల తనిఖీలు నిర్వహిస్తున్నారన్న భయంతో స్టేషన్ మాసాయిపేట వైపు వెళ్లి కాఫీడే వద్ద 44వ జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్నారు. ఆ సమయంలో హైదరాబాద్ వెళ్తున్న కారు వేగంగా వచ్చి వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని తూప్రాన్ ఆసుపత్రికి తరలిస్తుండగా భార్య దాసరి స్వప్న (29) మార్గమధ్యంలో మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన దాసరి రమేష్ (38)ను సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రమేష్ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. దంపతులు స్వప్నకు తూప్రాన్ ఆసుపత్రిలో, భర్త రమేష్‌కు గాంధీ ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. దంపతులిద్దరికి ఒకే సమయంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కూచారం గ్రామంలో ఏర్పాట్లు చేస్తున్నారు.



స్వప్న, రమేష్(ఫైల్)

గోసాయిపల్లిలో అగ్ని ప్రమాదం

● రూ. 13 లక్షల ఆస్తి నష్టం

కల్హేర్/సిర్గాపూర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండల పరిధిలోని గోసాయిపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో భారీ నష్టం జరిగింది. రూ. 13 లక్షల విలువ గల బంగారం, వెండి నగలు, నగదు, వస్తువులు కాలి బూడిదయినట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన చిల్లెల నాగయ్య కుటుంబం నివాసముంటున్న గృహానికి ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో 13 తులాల బంగారు, 26 తులాల వెండి నగలు, రూ.1.98 లక్షల నగదుతో పాటు ఇంటిలోని వస్తువులు కాలిపోయినట్లు వారు తెలిపారు. వైద్యుడైన నాగయ్య కుమారుడు దశరథ్ వివాహం ఇటీవల జరగగా ఆయన పెళ్లికి అత్తవారు పెట్టిన బంగారు, వెండి వస్తువులు ఇంట్లోనే ఉంచి దశరథ్ నారాయణఖేడ్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో విధుల కోసం వెళ్లగా ఆయన తల్లిదండ్రులు వ్యవసాయ పనుల కోసం వెళ్లిన సమయంలో ఈ సంఘటన జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగ్‌ను ప్రయాణికుడికి అందించిన కండక్టర్

హుస్నాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : బస్సులో తన బ్యాగ్ మర్చిపోయిన ఒక ప్రయాణికుడికి బ్యాగ్‌ను అప్పగించి బస్సు కండక్టర్, డ్రైవర్ తమ నిజాయితీని చాటుకున్నారు. మంగళవారం హన్మకొండ నుంచి సిద్దిపేటకు బస్సులో వస్తుండగా ఓ ప్రయాణికుడు హుస్నాబాద్‌లో దిగి హ్యాండ్ బ్యాగ్ మరచిపోయాడు. మళ్లీ దానిని హుస్నాబాద్ బస్టాండ్‌లో కంట్రోలర్ అబ్రహం సమక్షంలో కండక్టర్ పవన్‌కుమార్, డ్రైవర్ జేఆర్ చందర్‌లు ప్రయాణికుడికి అందించి తమ నిజాయితీని చాటుకున్నారు. అందులో రూ. 25 వేల నగదు, పాన్ కార్డు, ఒరిజనల్ లైసెన్స్, ఏటీఎం కార్డులతో పాటు విలువైన సామగ్రి ఉన్నాయి.

విద్యార్థులకు నిఘంటువుల పంపిణీ

నారాయణఖేడ్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి తెలుగు, ఇంగ్లీష్ మీడియం మాధ్యమాల్లో చదువుతున్న 100 మంది విద్యార్థులకు సెల్ఫ్ ఫోర్ సాఫ్ట్‌వేర్ సంస్థ, సేవోద్గం ఫౌండేషన్ నిఘంటువులను సమకూర్చింది.

దుర్గామాత ఆలయాల్లో చోరీ

మద్దూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ధూళిమిట్ట మండలం బెక్కల్, బైరాన్‌పల్లి గ్రామాల్లోని దుర్గామాత దేవాలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. బెక్కల్ గ్రామ శివారులో గల దుర్గామాత దేవాలయంలోని హుండీని పగలగొట్టి సుమారు 10 వేలను ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే బైరాన్‌పల్లి గ్రామ శివారులో గల దుర్గామాత ఆలయం గేటు పగలగొట్టుకుని వెళ్లిన దొంగకు హుండీ ఎలాంటి డబ్బులు లభ్యం కాకుండా పోయినట్లు సీసీ పుటేజీ ద్వారా బయట పడినట్లు తెలిపారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ అలీ తెలిపారు.



బెక్కల్ దుర్గామాత దేవాలయంలో చోరీ ఘటనపై ఆరా తీస్తున్న పోలీసులు



బైరాన్‌పల్లిలో సీసీ కెమెరాలో నమోదైన చోరీకి పాల్పడుతన్న దృశ్యం

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

చేగుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చికిత్స చేయించుకున్న ఆరోగ్యం నయం కాకపోవడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మరణించాడు. నార్సింగ్ ఎస్సై అహ్మద్ మైనుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం సుతార్ పల్లి గ్రామానికి చెందిన ఏర్పుల స్వామి (35) వ్యవసాయ చేసుకుంటూ అప్పుడప్పుడు ఆటో డ్రైవర్‌గా కూలీకి వెళ్తాడు. సోమవారం నార్సింగ్‌లోని హాస్టల్లో తన కుమారుడు వద్దకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రెండు సంవత్సరాల క్రితం పొలం వద్ద చెట్టుపై నుంచి కింద పడి నిమ్స్ ఆస్పత్రిలో ఆపరేషన్ అయింది. అయినప్పటికీ గాయం మానకపోవడంతో మనస్తాపం చెంది నార్సింగ్ మండలం మిర్జాపల్లి శివారులో పురుగుల మందు తాగి వాంతులు చేస్తుండగా తన కుమారుడు దుర్గాప్రసాద్ గమనించి 108లో రామాయంపేట ఆసుపత్రి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. స్వామి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



ఏర్పుల స్వామి (ఫైల్)

అప్పుల బాధతో ఒకరు..

చేగుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన చేగుంట మండల పరిధిలోని మక్కరాజుపేటలో చోటు చేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్ర గొల్ల ఎల్లం (36) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో ఇల్లు నిర్మాణం చేపట్టాడు. దానికోసం చేసిన ఎనిమిది లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక మధనపడుతూ ఉండేవాడని సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలపడంతో వెంటనే కుటుంబ సభ్యులు నార్సింగి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఎల్లంకి భార్య రేణుక, ఇద్దరు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై వెల్లడించారు.



ఎర్ర గొల్ల ఎల్లం (ఫైల్)

కుటుంబ సమస్యలతో విద్యార్థిని ..

మాసాయిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి చదువుతున్న ఓ విద్యార్థిని కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి వివరాల ప్రకారం.. మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన దొంతి నరసింహులు కుమార్తె మాసాయిపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తరచూ కుటుంబంలో కలహాలు గొడవలతో విసిగిన దొంతి అక్షయ ఈనెల (15) ఈ నెల 12న రాత్రి పెరటిలో మొక్కలకు వేసే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు పాల్పడిన అక్షయను ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. అక్షయ శవాన్ని పోస్టుమార్టానికి తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు



దొంతి అక్షయ (ఫైల్)

కుటుంబ కలహాలతో యువకుడు..

హవేళీఘణపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారంమండలం పరిధిలోని శమ్నాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జోగెల్లి కుమార్(34) కొంతకాలంగా మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవ పడుతూ ఉండేవాడు.. మంగళవారం కుమార్ తాగిన మైకంలో ఇంటికి వచ్చి గొడవపడి గ్రామ శివారులో ఉన్న గుట్ట వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అక్కడికి వెళ్లి చూసేసరికి కుమార్ మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రామచంద్రాపురం, టౌన్ జూలై 1 (ఆంధ్రజ్యోతి): భెల్ ఫ్లైఓవర్ వంతెన కింద గుర్తుతెలియని మృతదేహం లభ్యమయింది. ఈ సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గోపరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం లింగంపల్లి కూడలి భెల్ ఫ్లైఓవర్ వంతెన కింద భాగంలో 50 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడు. స్థానికంగా టీ దుకాణం నడుపుకుంటున్న సంపత్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

చేగుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన నార్సింగ్ మండల కేంద్రంలో జరిగింది. నార్సింగ్ ఎస్సై అహ్మద్ మైనుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంజరి నర్సింలు (35) కాసులాబాద్ గ్రామానికి చెందిన గణేష్ వద్ద వ్యవసాయ పనుల కోసం 29 సంవత్సరాలుగా(జీతం) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే నార్సింగ్ శివారులోని గణేష్ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి స్టార్టర్ డబ్బా వద్ద విద్యుత్ సరఫరా కాకపోవడంతో మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి నర్సింలు అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సింలుకి భార్య వెంకటవ్వ , కూతురు, కొడుకు ఉన్నారు. భార్య వెంకటవ్వ ఫిర్యాదు మేర ఎస్సై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



వంజరి నర్సింలు మృతదేహం

విద్యార్థి అదృశ్యం

టేక్మాల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి చదువుతున్న ఓ విద్యార్థి అదృశమెయ్యాడు. ఈ సంఘటన టేక్మాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. టేక్మాల్ ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాపన్నపేట మండల బాచారం గ్రామానికి చెందిన రావుగారి రాములు చిన్న కుమారుడు మహేశ్(15) టేక్మాల్‌లోని బీసీ హాస్టల్‌లో ఉంటున్నాడు. టేక్మాల్‌లోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. జూన్ 30న ఉదయం హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్నం నుంచి మహేశ్ ఆచూకీ కనబడ లేదు. సాయంత్రం అయినా హాస్టల్‌కు వెళ్లలేదు. బాలుడి తల్లిదండ్రులు టేక్మాల్‌కు చేరుకుని చుట్టుపక్కల బంధువల వద్ద వెతికినా ఫలితం కనిపించలేదు. బాలుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు టేక్మాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

నంగునూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జరిగే తెలంగాణ ఈఏపీ సెట్-2025 ప్రవేశాల కౌన్సెలింగ్ నంగునూరు మండలం రాజగోపాల్‌పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గోవర్ధన తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, టీజీ ఈఏపీ సెట్-2025లో క్వాలిఫై అయిన విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సులను అభ్యసించడానికి వీలుగా ఈ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 6 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటిరోజు 300 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను సిబ్బంది పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం వెబ్ ఆప్షన్లకు సంబంధించిన పలు సూచనలు చేశామన్నారు.



ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ సందర్భంగా ధ్రువపత్రాలను స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ గోవర్ధన్



పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం..

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రాంసింగ్ మూడు దశాబ్దాల క్రితం ఇస్నాపూర్ వచ్చి స్థిరపడ్డారు. పిల్లలకు ఇక్కడే పెద్దవారయ్యారు. ఆయనకు భార్య ఉషాదేవి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కైనా రాంసింగ్ పరిశ్రమలో పేలుడులో మృతిచెందడంతో వారు బోరున విలపించారు చిన్న కూతురికి వివాహ ప్రయత్నాలు జరుగుతుండగానే ఈ ఘటన చోటుచేసుకుందంటూ బంధువులు బోరుమన్నారు. పరిశ్రమలో సీనియర్ ఎంప్లాయిగా ఉన్న రాంసింగ్ అందరితో స్నేహంగా ఉండేవాడని చెబుతూ తోటి కార్మికులు కంటతడి పెట్టారు.



రోదిస్తున్న రాంసింగ్ భార్య ఉషాదేవి, కుమార్తెలు

కదిలిస్తే.. కన్నీళ్లే..

డ్యూటీకని వెళ్లి తిరిగి రాని తండ్రి ఆచూకీ కోసం కొడుకు.. భర్త ఏమయ్యాడో తెలియక రోధిస్తున్న భార్య.. కాలిన గాయాలతో ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న తమ్ముడి కోసం తోటి సోదరుల ఆరాటం.. చివరి చూపుకు సైతం నోచులేని విధంగా మూట కట్టిన మాంసం ముద్దను అంత్యక్రియలకు తీసుకెళ్తూ గుండెలవిసేలా విలపిస్తున్న ఓ కుటుంబం.. ఇలాంటి ఎన్నో హృదయ విదారక దృశ్యాలు పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడ సిగాచి పరిశ్రమ వద్ద, అలాగే పటాన్‌చెరు వంద పడకల ఏరియా ఆసుపత్రి మార్చురీ ప్రాంగణంలో మంగళవారం కనిపించాయి. మృతుల్లో ఒక్కొక్కరిదీ ఓ గాధ. వారి బంధువులను కదిలిస్తే చాలు.. కన్నీటి పర్యంతమవుతూ బరువెక్కిన గుండెలతో, ఏడ్చి ఏడ్చి తడారిన గొంతులతో తమ ఆవేదనను వెలిబుచ్చారు.

- పటాన్‌చెరు, రామచంద్రాపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి)



తమ్ముడి కోసం తోబుట్టువుల రోదనలు



మహారాష్ట్ర డెగ్లూరుకు చెందిన భీంరావు గత రెండేళ్లుగా సిగాచిలో పనిచేస్తున్నాడు. ప్రమాదంలో 80 శాతం గాయాలతో పటాన్‌చెరులోని ధృవ ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో ఉన్నాడు. మెరుగైన వైద్యం అందించేందుకు పెద్దాసుపత్రికి తరలిస్తే ప్రాణాలు నిలబడతాయన్న ఆశతో ఇద్దరు అన్నలు, ఇద్దరు అక్కలు కంటికి ధారగా ఆసుపత్రి ముందు కూర్చుని ఏడుస్తున్నారు. తమ్ముడికి భార్య, ఆరు నెలల పాప ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పరిహారం వద్దు.. ప్రాణం కాపాడండి..



బీహార్‌కు చెందిన మూన్‌మూన్ చౌదరి పేలుడులో 70శాతానికి పైగా కాలిన గాయాలతో ధృవ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. ఆయన భార్య మంజూ ఆసుపత్రి ముందు భర్త ప్రాణాలు కాపాడుకునేందుకు ఆరాటపడుతోంది. నగరంలోని పెద్ద ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు దక్కే అవకాశాలున్నాయని కొందరు అంటున్నారని, తాము పేదవాళ్లమని కార్పొరేట్ వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించింది. పరిహారం ఇవ్వడం కంటే మంచి మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని కోరుతున్నామని, ఆయనకేమైనా అయితే తాను, తన ఇద్దరు పిల్లలు ఆత్మహత్యే శరణ్యమన్నారు.

యూపీకి చెందిన అన్నదమ్ముల మృత్యువాత

సిగాచి ప్రమాదంలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం జహన్పూర్ జిల్లా సోన్‌పూర్‌కు చెందిన అన్నదమ్ములు అఖిలేష్, బిజయ్‌కుమార్ మృతి చెందారు. వీరు అన్నదమ్ముల పిల్లలు కావడంతో కుటుంబ సభ్యుల వేదనకు అంతే లేకుండా పోయింది. చెట్టంత ఎదిగిన కుమారులు ప్రమాదంలో మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్న వీరి కుటుంబాల్లో తీవ్ర విషాదం అలముకుంది. పరిశ్రమ ఇచ్చిన గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులు చూపిస్తూ మృతదేహాలను అప్పగించాలని పడిగాపులు కాయడం అందరినీ కలిచివేసింది.



అఖిలేష్, బిజయ్‌కుమార్ (ఫైల్)

బావ ఆచూకీ కోసం ఆరాటం

సిగాచి పరిశ్రమలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఇస్నాపూర్‌కు చెందిన సిలివేరు రవి ఆచూకీ కోసం రెండు రోజులుగా కుటుంబ సభ్యులు ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నారు. భర్తకు ప్రమాదం జరిగిందని తెలిసి రవి భార్య సొమ్మసిల్లి పడిపోయింది. రవి ఆచూకీ కోసం బావమరిది రవి, తోడల్లుడు నాగరాజు కనిపించిన ప్రతి అధికారిని వేడుకోవడం అందరినీ కంటతడి పెట్టించింది.

ప్రాణమిత్రుడి మృతితో..

కాగజ్‌నగర్ పేపర్ మిల్లులో కలిసి పనిచేసిన తన స్నేహితుడు నాగేశ్వరరావు సిగాచిలో సీనియర్ ఉద్యోగిగా పనిచేస్తూ మృతి చెందడంతో, మిత్రులందరూ కలిసి వచ్చారు. ఎంతో ఆత్మీయంగా ఉండే ప్రాణ స్నేహితుడు అకస్మాత్తుగా మృత్యువాత పడటం జీర్ణించుకోలేకపోతున్నామని స్నేహితుడు నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. నాగేశ్వరరావు మృతితో ఆయన కుటుంబం వీధిన పడిందని, మృతదేహాన్ని అప్పగించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని మిత్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

విధుల్లో చేరిన మూడు నెలలకే..

ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సిద్ధాంతగౌడ మూడు నెలల క్రితమే సిగాచి కంపెనీలో చేరారు. ఇస్నాపూర్‌లోని తేజకాలనీలో తల్లి విజయలక్ష్మీగౌడతో కలిసి నివాసం ఉంటున్నారు. కుటుంబంతో కలిసి బతికేందుకు సరిపడా జీతం వచ్చినప్పుడే వివాహం చేసుకోవాలన్న సంకల్పంతో ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. రెండు రోజులుగా తన కొడుకు ఆచూకీ తెలియక ఇబ్బందులు పడుతున్నామని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు.

ఆసుపత్రుల చుట్టూ ..

బీహార్ రాష్ట్రానికి చెందిన చోటేలాల్ మూడేళ్ల క్రితం కంపెనీలో చేరారు.పాశమైలారం గ్రామంలో నలుగురు కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. పేలుళ్లు జరిగినప్పటి నుంచి అక్క సంజూదేవి, తమ్ముడు ఎక్కడ ఉన్నాడంటూ అధికారులను అడుగుతున్నారు. తెల్లవార్లూ నిద్రపోకుండా గాయాలపాలైన వారిని చేర్పిన మూడు ఆసుపత్రులకు వెళ్లి విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకే గదిలో అద్దెకుంటున్న ముగ్గురు

బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్‌పాశ్వాన, దిలీప్ ఎగోసాయి, నాగపాశ్వాన అనే ముగ్గురు యువకులు ఒకే గదిలో అద్దెకు ఉంటున్నారు. వీరిలో నాగపాశ్వానకు వివాహం జరిగింది, భార్య గర్భవతిగా ఉన్నారు. వీరంతా ముందుగా ఒంటరిగా వచ్చి సంపాదించిన తరువాత కుటుంబసభ్యులను తీసుకువద్దామనుకున్న సమయంలో మృత్యువాత పడ్డారు. వీరి ఆచూకీ తెలియక బంధువులు, స్నేహితులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు.

మా అల్లుడు ఎక్కడ?

ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రసన్న మహాపాత్ర మూడేళ్లుగా కంపెనీలో పనిచేస్తున్నారు. ఇస్నాపూర్ గ్రామంలో భార్య, అత్తమామలతో కలిసి నివాసం ఉంటున్నారు. సోమవారం జరిగిన పేలుళ్ల జరిగిన తరువాత సమాచారం తెలియడం లేదంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నామని అత్త సునీత సాహూ, మామ నారాయణ సాహులు చెప్పారు. బతికి ఉన్నాడా లేడా చెప్పాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఆర్ఐ శ్రీకాంతనాయక్ చనిపోయిన వారి ఫోటోలను ఫోన్‌లో చూపించారు.

నలిగిన బతుకులు

(3వ పేజీ తరువాయి)



తీసి పోస్టుమార్టం, గుర్తించేందుకు పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనవాళ్లు కూడా గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాలు లభ్యమవ్వడంతో వైద్యులకు సవాలుగా మారింది. మంగళవారం సాయత్రం వరకు మార్చురీకి మొత్తం 37 మృతదేహాలు చేరగా అందులో సుమారు 18 మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. వారిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు చేపట్టారు. ఐలా భవనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో రక్త నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపారు. నివేదిక రాగానే సరైన వారికి మృతదేహాలను అప్పగిస్తామని ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. కాగా, పటాన్‌చెరు పట్టణంలోని ధృవ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్‌రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, డీజీపీ డాక్టర్.జితేందర్ తదితరులు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

సగానికిపైగా కాలిన బాధితులకు స్థానిక ఆసుపత్రుల్లో చికిత్సలపై విమర్శ

పటాన్‌చెరు పట్టణంలోని ధృవ ఆసుపత్రిలో మొత్తం 9 మంది తీవ్రమైన కాలిన గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. కాగా వారికి మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రికి తరలించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అందులో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కూతవేటు దూరంలో ఆధునిక కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా 70, 80 శాతం కాలిన గాయాలతో మృత్యువుతో పోరాడుతున్న కార్మికులను పటాన్‌చెరు, మియాపూర్, బీరంగూడాలోని చిన్న ఆసుపత్రుల్లో చేర్పించంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా కాలిన గాయాలతో వచ్చే బాధితులకు ప్రత్యేక పద్ధతుల్లో చికిత్సలు చేయాల్సి ఉంటుంది. పేలుడు జరిగిన పాశమైలారం నుంచి కూతవేటు దూరంలోని ఔటర్ రింగ్ మీదుగా గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లోని ఆధునిక కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా, బాధితులను అక్కడికి ఎందుకు తరలించలేదన్నది అంతు పట్టని ప్రశ్నలా మారింది. అపోలో, ఏఐజీ, కంచన్‌బాగ్ అపోలో (బర్నింగ్ కేసుల ప్రత్యేక ఆసుపత్రి), యశోద లాంటి ఆసుపత్రుల్లో చేర్పిస్తే ఫలితాలు బాగుంటాయని భావిస్తున్నారు. ప్రస్తుతం చికిత్సలు తీసుకుంటున్న ఆసుపత్రుల్లో ప్రత్యేక బర్నింగ్ వార్డులు లేకపోవడంతో ఇన్‌ఫెక్షన్‌లు త్వరగా సోకి పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. కాగా ఇంతపెద్ద ఎత్తున బర్నింగ్ కేసులను హ్యాండిల్ చేసిన ట్రాక్‌రికార్డు సదరు ఆసుపత్రులకు లేకపోవడం, నిపుణులైన సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కొనసాగుతున్న వైద్యంపై పెదవి విరుస్తున్నారు.



ఐలా భవనంలోకి హెల్ప్‌డెస్క్

పరిశ్రమ వద్ద అధికారులు ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. దానిలో ఆచూకీ తెలియని వారు, చనిపోయినవారు, బతికి ఉన్న వారి వివరాలతో కూడిన పత్రాల్లో పేర్లు సరిచూసుకొని కుటుంబసభ్యులకు వివరాలు చెపుతున్నారు. ఉదయం వేళ సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న సమయంలో కంపెనీ పక్కనే పెట్టిన హెల్ప్‌డెస్క్‌ను పోలీసులు తొలగించారు. అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఐలా భవనంలోకి మార్చారు. దీంతో కుటుంబసభ్యులు తీవ్రమైన మనోవేదనకు గురయ్యారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడం, మహిళలు కావడంతో అంతదూరం ప్రయాణం చేయలేకపోవడం, నడుచుకుంటూ వెళ్లే ఓపికలేక ఇబ్బందులు పడ్డారు. మరోవైపు చీటికీమాటికీ పోలీసులు అడ్డుకోవడంతో ఏంపాలుపోని స్థితిలో పరిశ్రమ వద్దే వేచిఉన్నారు. సమాచారం అందకపోవడంతో తీవ్రమైన ఆవేదనకు గురై, ఒకానొక సమయంలో పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



తన అల్లుడి ఆచూకీ కోసం మృతుల ఫోటోలు చూస్తున్న సునీత సాహూ



పరిశ్రమ గేటు వద్ద కుటుంబసభ్యుల పడిగాపులు

సీఎం రాక.. బాధితులకు ఊరట

3వ పేజీ తరువాయి

బీడీఎల్ పోలీస్ స్టేషన్‌లో మృతుడు జగన్ కుమారుడు యశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 105, 110, 117 సెక్షన్‌ల కింద సీఐ స్వామిగౌడ్ కేసు నమోదు చేశారు. తీవ్ర గాయాల పాలైన కార్మికులను వివిధ ఆసుపత్రుల నుంచి యశోద, అపోలో ఆసుపత్రులలో మెరుగయిన చికిత్సలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. 60-80 శాతం కాలిన వారి విషయంలో అయ్యే వైద్య ఖర్చులను పరిశ్రమ భరించేటట్టు చర్చలు జరిపారు. మరో వైపు కాలుష్య నియంత్రణ మండలి, బాయిలర్‌శాఖ, కర్మాగారాలశాఖ, పరిశ్రమలశాఖ, వైద్యఆరోగ్య శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశ్రమపై చర్యలు తీసుకునే క్రమాలపై అడుగులు వేస్తున్నారు. కాలుష్య నిబంధనలు ఉల్లంఘనలపై ఇప్పటికే పీసీబీ సభ్య కార్యదర్శి విచారణ చేపట్టారు. పరిశ్రమకు చెందిన అన్ని రకాల డిపాజిట్‌లను సీజ్ చేస్తున్నారు.

రంగంలోకి హైడ్రా

పరిశ్రమలోపలి భాగంలో కూలిన మూడు అంతస్థుల భవనంలోని కింది అంతస్తు శిధిలాల తొలగింపు వేగవంతంగా జరుగుతోంది. మధ్యాహ్నం సమయంలో కమిషనర్ రంగనాథ్ కూల్చివేతలను పర్యవేక్షించారు. జరిపారు. మరో వైపు పేలుళ్లు పునరావృతం కాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవచ్చనే దానిపై సీఎస్ ఆధ్వర్యంలో కంపెనీలోనే సమీక్ష నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలు

పకడ్బందీగా అమలు చేయాలి

● పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ

సంగారెడ్డి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ), ఎల్ఐపీ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్) కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మి ఆదేశించారు. సంగారెడ్డిలోని సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయంలో మంగళవారం ఎంఈవోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావడానికి మండల స్థాయిలో ఈ నెల 20లోగా పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బడిబాట వివరాలు ఖచ్చితంగా ప్రధానోపాధ్యాయుల చేత ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు పట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతిరోజు ఉదయం 11 గంటలలోపు ఖచ్చితంగా హాజరు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో బడిబాట ద్వారా కొత్తగా నమోదైన విద్యార్థుల గురించి మండలాల వారీగా సమీక్షించారు. అనంతరం ఇన్‌స్పైర్ నామినేషన్లకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఈవో వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు వెంకటేశం, బాలయ్య, తాజుద్దీన్, సుప్రియ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటకు పురుగుల బెడద

● ఆందోళనలో రైతులు

కంగ్టి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే అన్నదాతకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. పంటలకు సరిపడా వర్షాలు లేక మొలకెత్తిన మొలకలను రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతుంటే, మరోవైపు పైసా పురుగులు పత్తి మొలకలను రెండాకుల దశలోనే తొలిచి వేస్తున్నాయి. మృగశిర కార్తె ఆరంభంలో కురిసిన వర్షాలకు రైతులు విత్తనాలు వేసుకోగా మొలకలు వచ్చాయి. ఆ తర్వాత వర్షం జాడ లేకపోవడంతో పంట పొలాల్లో పురుగుల ఉధృతి అధికమైంది. భూమిలో తేమ లేక పత్తి విత్తనాలు సగానికి పైగా మొలకెత్తనే లేదు. మొలచిన వాటిని కూడా పైసా పురుగులు తొలిచివేయడంతో మొలకలు కనిపించకుండా పోయాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రెండు రోజుల క్రితం కురిసిన కొద్దిపాటి వర్షానికి పొలాల్లో మళ్లీ కూలీలతో పత్తి నాట్లు వేయిస్తున్నారు. ఖరీఫ్ ఆరంభం నుంచి ఒక్క భారీ వర్షం కూడా కురవకపోయినప్పటికీ, వ్యవసాయంపై ఆశతో సాగు పనులు పూర్తి చేసుకున్నారు. ఇప్పుడు వానలు లేక, పురుగుల బెడద కూడా అధికమవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పురుగుల నుంచి పత్తి మొలకల రక్షణకు రైతులు బియ్యంలో గానీ, మురుమురాలలో గానీ రసాయన మందును కలిపి పొలాల్లో చల్లుతున్నారు. దీంతో కొంత పురుగుల ఉధృతి తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు.



కంగ్టిలో ఓ రైతు పొలంలో పత్తి మొలకలను తొలిచేస్తున్న పైసా పురుగులు



సంగారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకుల

సిగాచి పరిశ్రమ ప్రమాదంపై విచారణ జరపాలి: ఐఎఫ్‌టీయూ

సంగారెడ్డి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పారిశ్రామికవాడ పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై న్యాయ విచారణ జరపాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ముందు మంగళవారం ఐఎఫ్‌టీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఈ ఘటనతో లేబర్, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల వైఫల్యం మరోసారి బట్టబయలైందని, పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇంత పెద్ద ప్రాణనష్టం జరిగిందని పేర్కొన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించి, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అనురాధ, శివబాబు, పద్మ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, కోటి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్యా ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా వెంకటరెడ్డి



వెంకటరెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వయోజన విద్యా ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా కె.వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వయోజన విద్యా స్టేట్ డైరెక్టర్ ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వర్తించిన టి.రామేశ్వర్ ఉద్యోగ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో ప్రాజెక్ట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఉత్తర్వులు వెలువరించారు. ఈ సందర్భంగా ఆయన డైరెక్టర్ డా.జి.ఉషారాణికి కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం : ఎంపీడీవో

పెద్దశంకరంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవానికి అన్ని గ్రామాల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో షాకీర్‌అలీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శివాయిపల్లిలో నర్సరీని ఆయన పరిశీలించారు. గ్రామాలవారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను నాటాలని గ్రామ కార్యదర్శి సవితకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో సంతోష్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి అర్హత పరీక్ష

తూప్రాన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని తెలంగాణ గురుకుల పాఠశాలలో ఖాళీలకు జూలై 10న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తారాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. తూప్రాన్ బాలుర గురుకులంలో 6వ తరగతిలో 6, 7వ తరగతిలో 4, 8వ తరగతిలో 13 ఖాళీలు ఉన్నాయని వివరించారు. తరగతుల్లో ఖాళీలు భర్తీ చేసేందుకు అర్హత పరీక్షను మెదక్ బాలికల గురుకులంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 8లోగా విద్యార్థులు గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో పురస్కారాల కోసం ఈ నెల 13వ తేదీలోగా తమ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ఫారాలను సంబంధిత పత్రాలను జతచేసి డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

కాజీపల్లిలో కమిషనర్ పర్యటన

జిన్నారం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీ కాజీపల్లిలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, ఆర్వో మధుసూదన్‌రెడ్డి, ఇతర సిబ్బంది పర్యటించారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ గృహాల శంకుస్థాపనలో పాల్గొన్నారు. స్థానిక పల్లె వనం, గ్రామాన్ని సందర్శించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

చెట్లతో ఆరోగ్యానికి మేలు

నిజాంపేట జూలై 1 (ఆంధ్రజ్యోతి) : చెట్లు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దేమే యాదగిరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వారిచే మొక్కలు నాటి యోగాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

టేక్మాల్‌లో ఫిజియోథెరఫీ శిబిరం

టేక్మాల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన టేక్మాల్‌లోని ఎంఈవో కార్యాలయంలో దివ్యాంగులకు ఫిజియోథెరఫీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల దివ్యాంగులైన 8 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఎంఈవో సుజాత, వైద్యాధికారిణి మౌనిక, ఐఈఆర్‌పీ రవికిరణ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

వెల్దుర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంతోష్, ఉపాధ్యక్షుడిగా కుమార్‌ను ఎన్నుకున్నారు. అలాగే వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణానికి భూమి పూజ చేశారు. 7న ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సైదులు, వెల్దుర్తి మండల ఇన్‌చార్జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అపహరణ

నర్సాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్ అపహరణకు గురైనట్లు ప్రొబేషనరీ ఎస్ఐ శిరీష పేర్కొన్నారు. మండలంలోని జక్కపల్లికి చెందిన భరత్ నర్సాపూర్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణం వద్ద తన ప్యాషన్ ప్లస్ బైక్ పార్కుచేసి వెళ్లాడు. తిరిగి వచ్చేవరకు బైక్ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శిరీష తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పుల్‌కల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన సంఘటన మండల కేంద్రం చౌటకూర్‌లో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన కొజ్జ రాజు తన పాడిగేదేను గ్రామ శివారులోని ఈఎంపీఈ డిస్టిలరీ పరిశ్రమ పరిసర ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అక్కడ రైతు రవీందర్‌రెడ్డికి చెందిన వ్యవసాయ భూమిలో మేస్తుండగా.. పొలంలో పాతిన విద్యుత్ స్తంభానికి అమర్చిన సపోర్టు వైర్‌కు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు. విద్యుత్ అధికారులు స్పందించి పరిహారం చెల్లించాలని మాజీ సర్పంచ్ కొల్కూరి వీరమణిమొగులయ్య కోరారు.

ఎట్టకేలకు మోక్షం

- దాయర-చమన్ రోడ్డు విస్తరణ పనులు షురూ
- కూల్చివేతలు ప్రారంభించిన మున్సిపల్ అధికారులు



దాయర-చమన్ రోడ్డులో ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేతలు చేస్తున్న దృశ్యం

మెదక్ మున్సిపాలిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రంలో ఎట్టకేలకు దాయర-చమన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో రెండు దశాబ్దాలుగా ఎదురుచూసిన ప్రజలు కాస్త ఊరట చెందారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పనులకు ఆమోదం తెలిపి, రూ.7.50 కోట్లను కేటాయించారు. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా టెండర్లు పిలిచారు. కానీ అనుకున్న విధంగా పనులు మాత్రం ముందుకు సాగలేదు. సుమారు 18 నెలల క్రితం చమన్-దాయర రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమవగా.. కొద్దిరోజులకే అవికాస్తా అసంపూర్తిగా నిలిచిపోయాయి. రోడ్డు విస్తరణలో కూల్చివేతలు లేని ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సదరు కాంట్రాక్టర్ చేపట్టారు. అంతేగాకుండా రోడ్డు విస్తరణకు అవసరమైన సామగ్రిని సమకూర్చుకున్నారు. కానీ రోడ్డు విస్తరణలో తమ తమ నివాసాలు కోల్పోతున్నామని కొంతమంది భవన యజమానులు కోర్టుకెళ్లారు. దీంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఓ వైపు విస్తరణలో స్థలాలు వదిలేసుకున్న వారు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే కోర్టు రోడ్డు విషయంలో నిబంధనల ప్రకారం అధికారులు విస్తరణ చేపట్టాలని ఆదేశాలివ్వడంతో మళ్లీ పనుల్లో చలనం మొదలైంది. పదిరోజులుగా ఇళ్ల కూల్చివేత విషయంలో మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. మంగళవారం టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీవో భూపతి, టీపీబీవో ప్రభాకర్ రోడ్డు విస్తరణలో ఇళ్లను ఎక్స్‌కవేటర్లతో కూల్చివేయించారు. పనులు ప్రారంభమవడంపై చమన్-దాయర రోడ్డుగా వెళ్లే ప్రజలు, ముత్తాయికోట, మదుల్‌వాయి, కూచన్‌పల్లి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్లుగా నిలిచిన రోడ్లను బాగు చేస్తున్నాం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

రామాయంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ హయాంలో నిలిచిన రోడ్లను బాగు చేస్తున్నట్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ప్రకటించారు. ఇందుకోసం భారీఎత్తున నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. మంగళవారం రామాయంపేటలోని పలు వార్డుల్లో 14 చోట్ల సీసీరోడ్లు, డ్రైనేజీలు, వివిధ సంఘాల కమ్యూనిటీహాల్స్‌కు శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతారావు, రమేష్‌రెడ్డి, సరాఫ్ యాదగిరి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు యుగేందర్, యాదగిరి ఉన్నారు.



రామాయంపేటలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలి : కలెక్టర్

టేక్మాల్/తూప్రాన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రమైన టేక్మాల్‌లోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వసతి గృహాల్లోని వంటగది, స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేసి కోడిగుడ్ల బరువు, పల్లీల నాణ్యత, ఆయిల్ ప్యాకెట్ తయారీ తేదీని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరాతీసి, వారి చదువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి రెవెన్యూ సదస్సుల్లో తీసుకున్న దరఖాస్తును ఆన్‌లైన్‌లో పరిశీలించి, పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరాం, వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

విద్యార్థుల సంఖ్యను పెంచాలి : కలెక్టర్

తూప్రాన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వసతిని ప్రజలు, తల్లిదండ్రులు వినియోగించుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ కోరారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో జూన్ 26న 'హాస్టల్ వెలవెల' అనే కథనం ప్రచురితం కావడంతో స్పందించిన కలెక్టర్ సోమవారం రాత్రి హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.. 400 మంది విద్యార్థుల హాస్టల్‌లో చాలా తక్కువ మంది ఎన్‌రోల్ చేసుకున్నట్లు కలెక్టర్ వివరించారు. వసతులు పెంచుతామని, డ్రాపవుట్‌లు ఇంట్లో ఉండకుండా హాస్టల్‌లో చేర్పించాలని రాహుల్‌రాజ్ సూచించారు.

ఆయిల్‌పామ్ సాగుకు మెదక్ నేలలు అనుకూలం

నర్సాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేసుకునేందుకు నేలలు అనుకూలంగా ఉంటాయని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ప్రతాప్‌సింగ్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని రైతువేదికలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. మామిడి, జామ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, పపాయ సాగుకు 40 శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కూరగాయల సాగుకు ఆసక్తి ఉన్నవారు వందశాతం రాయితీతో మిరప, వంకాయ సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రతాప్‌సింగ్

భరోసా సిబ్బంది కృషి అభినందనీయం : ఎస్పీ

మెదక్ అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో నిందితుడికి శిక్షపడే విధంగా మెదక్ భరోసా కేంద్రం సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాలికపై జరిగిన పోక్సో కేసులో శిక్షపడేలా కృషి చేసిన భరోసా సిబ్బందికి మహిళా భద్రతా విభాగం అదనపు డీజీపీ చారుసిన్హా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ భరోసా సిబ్బంది సేవల తీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ పాల్గొన్నారు.



భరోసా సిబ్బందితో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ప్రతిభకు పట్టం కడితేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- వినోద్ హాస్పిటల్ ఎండీ డా.వినోద్‌కుమార్‌కందాళ

సంగారెడ్డి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సరైన దిశలో ప్రోత్సహిస్తే వారు దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదుగుతారని వినోద్ హాస్పిటల్ ఎండీ డా.వినోద్‌కుమార్‌కందాళ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థినులకు ఇటీవల కందాళ ఫౌండేషన్ తరఫున నగదు పురస్కారాన్ని అందజేశారు. వైద్య వృత్తి పట్లనే కాకుండా సమాజం, విద్యార్థుల పట్ల నిబద్ధత, విధేయతతోఆడపిల్లల చదువు, ఎదుగుదలకు కృషి చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్న వినోద్ వైద్యాలయ యజమాని డా.వినోద్‌కుమార్‌ను పలువురు ఉన్నతాధికారులు ప్రశంసిస్తున్నారు.



విద్యార్థినికి ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న డా.వినోద్‌కుమార్‌కందాళ

వర్షానికి కూలిన పోలీస్‌స్టేషన్ ప్రహరీ

రామాయంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షానికి శిలాఫలకాలు ధ్వంసమయ్యాయి. రామయంపేటలోని పోలీస్‌స్టేషన్ ప్రహరీ ఆనుకొని రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ వీటిని ఏర్పాటు చేసింది. పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఈ శిలాఫలకాలపై ప్రహరీ పడడంతో నేలకూలాయి.

బోనాల ఉత్సవాల కమిటీ సభ్యుడిగా ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, జూలై (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ బోనాల ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. చైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి, సభ్యులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, జూపల్లి క్రిష్ణారావు, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రజా వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎంపీ సురేష్‌షెట్కార్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఉన్నారు. ఈ కమిటీ ఆషాఢ బోనాల ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష చేసి, ఉత్సవాలు విజయవంతం చేసేలా మార్గదర్శకం అందిస్తుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది.

మంత్రి లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే సన్మానం



మంత్రి లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో చోటు దక్కించుకుని, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖల మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ బాధ్యతలు స్వీకరించారు. కాగా మంగళవారం ఆయన నివాసంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చెరకు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. అలాగే కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కుమార్తె తోటజసింత ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని హోటల్ టీజీపీ లీలాలో గ్రాడ్యుయేషన్ విందును ఏర్పాటు చేశారు. ఇందులో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు అన్వేష్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు.

వానొస్తే కరెంట్ కట్..!



చౌటకూర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకటిగా మారిన ప్రధాన వీధి

పుల్‌కల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చౌటకూర్‌లో గాలి వాన కురిస్తే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నది. వారంరోజులుగా సాయంత్రం వేళ గాలితో కూడిన వాన కురుస్తుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. ప్రతిరోజూ ఇలా జరుగుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి సైతం గ్రామంలోని కిందిబజార్‌లో కండక్టర్ వైర్ తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాల్సిన హెల్పర్, లైన్‌మెన్లు స్థానికంగా నివాసం ఉండటం లేదు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి హెల్పర్, లైన్‌మెన్లు స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకుని, అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్/హత్నూర/నర్సాపూర్/రామాయంపేట/కల్హేర్/చిన్నశంకరంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పలువురు వైద్యాధికారులకు జనజాగృతి సేన ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, ఆర్‌ఎంవో డా.వీరాంజనేయులును శాలువాలతో కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనజాగృతిసేన అధ్యక్షుడు బంగారుకృష్ణ, విజయ్‌భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్‌ను బీఆర్ఎస్ నాయకులు పూలమొక్క అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాకేష్, తదితరులు పాల్గొన్నారు. హత్నూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రజిని, సిబ్బందిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు జైపాల్, మాజీ ఉపాధ్యక్షుడు ఆకుల కిష్టయ్య, సభ్యులు పాల్గొన్నారు. నర్సాపూర్ ఏరియా ఆస్పత్రిలో వైద్యులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, జోనల్ చైర్మన్ బుచ్చేస్‌యాదవ్, అధ్యక్షుడు రాఘవేందర్‌రావు, కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు. రామాయంపేట ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ లింబాద్రిని ఇతర డాక్టర్లు శాలువాతో సత్కరించారు. మండల కేంద్రమైన కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యాధికారి జేబా షమీమ్, సీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్, సిబ్బందిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, దేవదాస్, సయ్యద్ వహీం, శంకర్, అనిల్, సత్యాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మేరి మాత పాఠశాలకు చెందిన విద్యార్థులు వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లను సన్మానించారు.



సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసి పూల మొక్క అందజేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

బహిరంగ సభను విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జూలై 4న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిన్నారం మండలం మాధారంలో నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని, గ్రామస్థాయి నుంచి సమన్వయంతో సభకు తరలిరావాలని పేర్కొన్నారు. అనంతరం వావిలాలలో నిర్వహించిన ఎల్లమ్మ దేవి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు చంద్రారెడ్డి, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వడ్డె కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి



విద్యార్థులకు సురక్షిత మంచినీటి యంత్రాన్ని, నోట్ పుస్తకాలను అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

కొండాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సోదరుడు శ్రీధర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సురక్షిత మంచినీటి యంత్రాన్ని, నోట్ పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి

సంగారెడ్డి క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని స్థానిక సంస్థల్లో వికలాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ ప్రతినిధుల బృందం కోరింది. మంగళవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మహ్మద్ షఫీ అహ్మద్‌ఖాన్, వైస్ చైర్మన్ దైనంపల్లి మల్లికార్జున్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బెస్తా యాదగిరి, శబరిచావ్ల, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

వర్షాల కురవాలని జలాభిషేకం



నిండు కలశాలతో పాదయాత్రగా బయలుదేరిన గ్రామస్థులు

నారాయణఖేడ్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురిసి గ్రామాలు పాడి పంటలతో కళకళలాడాలని మండల పరిధిలోని అనంత్‌సాగర్ గ్రామస్థులు మంగళవారం ఉదయం గ్రామంలోని హనుమాన్ ఆలయానికి బయలుదేరారు. ఆంజనేయస్వామికి జలాభిషేకం చేసి, అక్కడి నుంచి హరినామస్మరణ, భజనలు, కీర్తనలు చేస్తూ 11 నిండు కలశాలను తలలపై పెట్టుకొని పాదయాత్రగా బయలుదేరారు. చుట్టుపక్కల 11 గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అంజనేయస్వామివారికి జలాభిషేకాలు చేశారు.

దరఖాస్తుదారుడికి సమాచారం ఇవ్వండి

సంగారెడ్డి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణానికి చెందిన సమాచార హక్కు సామాజిక కార్యకర్త శ్రీధర్ మహేంద్ర అడిగిన సమాచారం ఇవ్వాలని దేవాదాయ సహాయ కమిషనర్‌కు రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాలు జారీచేసింది. సంగారెడ్డి రాజంపేటలోని సర్వే నెంబరు 292లోని దేవాదాయ భూమిలో అక్రమ నిర్మాణాలపై దేవాదాయ అధికారులు, సంగారెడ్డి తహసీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన సర్వే నివేదికను దేవాదాయ సహాయ కమిషనర్ మెదక్, సంగారెడ్డి కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేసి సమాచారం కోరారు. సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించడంతో శ్రీధర్ రాష్ట్ర సమాచార కమిషన్‌లో అప్పీలు చేయగా.. జూన్ 25న విచారణ చేసిన రాష్ట్ర సమాచార కమిషన్ దరఖాస్తుదారు కోరిన సమాచారం వారంలో ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసినట్టు శ్రీధర్ మహేంద్ర తెలిపారు.

కళాకారుడికి కన్నీటి వీడ్కోలు

పాపన్నపేట జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో మృతిచెందిన ప్రముఖ కళాకారుడు పాత లింగాయిపల్లి కిష్టయ్య అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామంలో ముగిశాయి. మృతుని భార్య మాజీ సర్పంచ్, కిష్టయ్య మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పదవి చేపట్టారు. అందరితో కలుపుకోలుగా ఉండే ఆయన సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన అంత్యక్రియలో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, కళాకారులు, స్నేహితులు పాల్గొన్నారు. అలాగే మృతుడి భార్యకు పలువురు ఆర్థిక సహాయం అందజేశారు.

జలవిహార్ పార్కులో లైటింగ్ : కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పార్కుల్లో లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ చెప్పారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ జలవిహార్ పార్కులో రూ.25 లక్షలతో లైటింగ్ పనులు ప్రారంభించి మాట్లాడారు. పార్కుల్లో రాత్రీపగలు అనే తేడా లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణం సృష్టించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐలేష్, మల్లేష్, నవీన్‌యాదవ్, రవి, హన్మంతు, రమేష్, మల్లికార్జున్, సత్యం పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎప్పుడిస్తారు..?

జహీరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎప్పుడిస్తారని లబ్ధిదారులు మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ కృపానందం లబ్ధిదారులను సముదాయించారు. జూన్ 7 వరకు అందరికీ ఇళ్ల తాళాలు ఇస్తామని చెప్పడంతో వారంతా ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు మైపాల్ మాట్లాడుతూ పట్టాలు ఇచ్చారు. కానీ అధికారులు తాళాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జూన్ 7న అధికారులు తాళాలు ఇవ్వకపోతే పట్టా సర్టిఫికెట్లు ఉన్న లబ్ధిదారులు కేటాయించిన డబుల్ బెడ్‌రూంల వద్దకు వెళ్లి మనమే తాళాలు వేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

ఆరోగ్య శిబిరం సందర్శన

రామాయంపేట : రామాయంపేట మున్సిపల్ పరిధి గుల్పర్తిలో నడుస్తున్న ఆరోగ్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సందర్శించారు. రెండురోజుల క్రితం మండల వైద్యాధికారి హరిప్రియ సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో శ్రీరామ్ చేరుకొని గ్రామంలోని విషజ్వరాలపై ఆరాతీశారు.